



మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలలకు చేరిన బియ్యం బస్తాలు

కూటమి పాలనపై సానుకూలత

మెజారిటీ ప్రజల్లో సంతృప్తి

- పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, మద్యం, ఇసుక విధానాలపై హర్షం
- ప్రస్తుతం చేతినిండా పని దొరుకుతోందన్న తాపీమేస్త్రి
- మిశ్రమ స్పందన వెలిబుచ్చిన మరికొందరు
- సంక్షేమ పథకాలన్నీ అమలు చేయకపోయినా, ప్రభుత్వ నిర్ణయాలు బాగున్నాయని కితాబు
- హామీలన్నీ ఇంకా పూర్తిగా నెరవేర్చలేదని ఇంకొందరి అసంతృప్తి
- రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది



ఏడాది క్రితం ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నప్పటి చిత్రం

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): **కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో సానుకూలత కనిపిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాలు, అమలు చేస్తున్న పథకాలపై మెజారిటీ ప్రజలు సంతృప్తితో, ఉన్నారు. కొందరు మాత్రం పథకాలు సరిగా అమలు చేయడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో కొన్ని రకాల భయాలు, ఆందోళనలు ఉండేవని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని మరికొంతమంది అన్నారు. ఇప్పటికే కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని, మరికొన్నింటిని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోం దని, అందుకు మరింత సమయం ఇవ్వాలని ఇంకొందరు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే అత్యధికులు సంతృప్తిని, కొందరు అసంతృప్తిని వ్యక్తంచేయగా, ఇంకొందరు పర్వాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై గురువారం నాటికి ఏడాది అవుతోంది. ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేం దుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటిం చారు. వివిధ వర్గాలకు చెందిన వారి అభిప్రాయాలను సేకరించారు.**

ఈ అంశాలపై సంతృప్తి..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, మద్యం, ఇసుక వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు సమర్థిస్తున్నారు. వీటితోపాటు రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు అభివృద్ధి బాటలో నడిపేందుకు శ్రమిస్తున్న తీరు పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో భయంతో బతకాల్సి వచ్చేదని, ఈ ప్రభుత్వంలో ఆ అవసరం లేదని ఎంవీపీ కాలనీకి చెందిన మెకానిక్ గురునాయుడు పేర్కొన్నారు. గతంలో భూ ఆక్రమణలు గురించి పెద్దఎత్తున చర్చ జరిగేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. నాడు భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు పని దొరకని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పని దొరుకుతోందని ఇసుకతోటకు చెందిన తాపీమేస్త్రి వై.అప్పలస్వామి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక కృత్రిమ కొరత సృష్టించి పనుల్లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం చేసేందుకు పని దొరుకుతోందని, మద్యం ధర తగ్గించడంతోపాటు మంచిది విక్రయిస్తున్నారంటూ ఆనందాన్ని వ్యక్తంచేశాడు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారని, ఇప్పటికే గ్రూప్-2, కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తిచేశారని హెచ్‌బీ కాలనీకి చెందిన ఎస్.నాగరాజు అనే నిరుద్యోగి పేర్కొన్నాడు. పాలన బాగుందని కితాబిచ్చాడు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారని, అమ్మ ఒడి వేస్తామని ఇప్పటికే ప్రకటించారని, పాలన ... మిగతా 4వ పేజీలో

నేటి నుంచి పాఠశాలలు

తొలిరోజునే స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

- సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం
- విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): **వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి రోజునే సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్లు (బూట్లు మినహా మిగిలినవి) పంపిణీ చేయనున్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫామ్‌కు అవసరమైన క్లాత్, ఒకటి, ఆరో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు డిక్షనరీలు, బెల్టు అందజేస్తారు.**

గత విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 72 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేసింది. గతంలో ముతక బియ్యం 50 కిలోలు వంతున పంపిణీ చేసేవారు. ఇప్పుడు మధ్యాహ్న భోజనం పథకం పేరుతో ముద్రించిన 25 కిలోల బస్తాలు పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి ముతకబియ్యం సరఫరాతో రమారమి 30 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. సన్న బియ్యం దుర్వినియోగం కాకుండా ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ ముద్రించారు.



తోటగరవు జడ్పీ హైస్కూలుకు చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ఇక గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 117 రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పాఠశాలలను పునర్వ్యవస్థీకరించింది. ఫౌండేషన్ నుంచి హైస్కూల్ ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలల వరకూ పలు కేటగిరీలుగా విభజించింది. విశాఖ జిల్లాలో 41 ఫౌండేషన్, 232 బేసిక్, 178 మోడల్ ... మిగతా 4వ పేజీలో



క్వీన్ మేరీ గర్ల్స్ హైస్కూల్‌లో బెంచీలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పాఠశాలలు సిద్ధం

పునఃప్రారంభానికి పాఠశాలలను సిద్ధం చేశాం. మూడు, నాలుగు రోజుల నుంచి ఉన్నత పాఠశాలల్లో వసతుల పై ప్రధానో పాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. గురువారం నుంచి సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించనున్నాము. పిల్లలకు కిట్లు పంపిణీ చేస్తాం. పిల్లల చేరికలు పెంచుకునేలా ప్రణాళిక రూపొందించి అమలుచేస్తాం. గురువారం నుంచి ప్రతి విద్యార్థి పాఠశాలలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి

సీఎం రాక రేపు

రెన్యువబుల్ ఎనర్జీ సదస్సుకు హాజరు

- అనంతరం సిరిపురంలో ది డెక్, రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం
- చిల్డ్రన్ ఎరీనాలో పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి
- పలు పరిశ్రమలకు శంకుస్థాపన



విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 13వ తేదీన (శుక్రవారం) నగరానికి రానున్నారు. ఆ రోజు ఉదయం పది గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 11.20 గంటలకు నోవాటెల్ హోటల్ కు చేరుకుని, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రెన్యుబుల్ ఎనర్జీపై జరిగే ప్రాంతీయ వర్క్‌షాపులో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ హోటల్‌లో ఉండి, రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలపై సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 4.10 గంటలకు సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనం వద్దకు చేరుకుని దానిని ప్రారంభిస్తారు. అందులోనే ఏర్పాటవుతున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను కూడా ప్రారంభించి విద్యార్థులు, ఔత్సాహికులు, స్టార్టప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం 4.50 గంటలకు బయలుదేరి సమీపంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ... మిగతా 4వ పేజీలో



చిల్డ్రన్ ఎరీనాను సందర్శిస్తున్న కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, పోలీస్ కమిషనర్ తదితరులు

పోలీసుల అదుపులో జర్నలిస్టు కృష్ణంరాజు

- శ్రీకాకుళం నుంచి వస్తుండగా విశాఖ జిల్లా భీమిలి మండలం అమనాం వద్ద పట్టుకున్న వైనం



'సాక్షి' ఛానల్ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజును గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు బుధవారం విశాఖపట్నం జిల్లా భీమిలి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను రోడ్డుమార్గంలో తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిసింది.

.... వివరాలు మెయిన్ పేజీలో

నీటి సరఫరా కార్మికుల సమ్మె వాయిదా

- పది రోజుల్లో కొత్త వేతనాలు ఇచ్చేందుకు మేయర్, ఇన్‌చార్జి కమిషనర్ హామీ

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు బుధవారం నుంచి నిర్వహించతలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్టు యూనియన్ నేతలు ప్రకటించారు. నీటిసరఫరా విభాగంలో స్కిల్డ్ వర్కర్లుగా పనిచేస్తున్న సుమారు 900 మందికి జీతాల పెంపునకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదించినప్పటికీ, ఆడిట్ అధికారులు నిలుపుదల చేయడంతో బుధవారం తెల్లవారుజాము నుంచి విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అవుట్‌సోర్సింగ్ విభాగం సిబ్బంది సమ్మెకు దిగితే నగరంలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది కాబట్టి అధికారులు అప్రమత్తమయ్యారు. మేయర్ పీలా శ్రీనివాసరావుతోపాటు, ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్మిక సంఘాల నేతలతో మంగళవారం రాత్రి మేయర్ పీలా శ్రీనివాసరావు ఫోన్‌లో చర్చలు జరిపారు. పది రోజుల్లో కొత్తవేతనాలను కార్మికులకు అందేలా చర్యలు తీసుకుంటామని, అంతవరకు సమ్మె ఆలోచన విరమించుకోవాలని కోరారు.

దీంతో కార్మిక సంఘాల నేతలు సమ్మెను విరమిస్తున్నట్టు మంగళవారం అర్ధరాత్రే ప్రకటించారు. కార్మికులందరినీ విధుల్లోకి వెళ్లిపోవాలని ఆదేశించడంతో బుధవారం నీటి సరఫరా యథావిధిగా జరిగింది.

ఉక్కు దూకుడు

పూర్తిస్థాయి ఉత్పత్తిపై దృష్టి

- 25న మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభానికి సన్నాహాలు
- యాజమాన్యం యత్నాలు సఫలీకృతమయ్యేనా?
- వర్షాలతో ఐరన్‌ఓర్ సరఫరాపై అనుమానం
- మరమ్మతుల్లో 1, 3 కోక్ ఓవెన్ బ్యాటరీలు
- సిబ్బంది కుదింపు మరో సమస్య



స్టీల్ ప్లాంట్‌లోని బ్లాక్ ఫర్నేస్ విభాగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు యాజమాన్యం బ్లాస్ ఫర్నేస్-3ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోం ది. ఈ నెల 25వ తేదీ ముహూర్తంగా నిర్ణయించింది. ఇప్పటికే దానికి అవసరమైన ప్లేట్లను చైనా నుంచి దిగుమతి చేసుకొని అమరిక పనులు పూర్తిచేసింది. ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపి 100 శాతం ఉత్పత్తి చేయాలనేది యాజమాన్యం లక్ష్యం. ఇప్పుడు రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా రోజుకు 14 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తున్నారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభిస్తే 21 వేల టన్నులు తీయాల్సి ఉంటుంది. వాస్తవానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూర్చుకోలేకే బీఎఫ్-3 మూతపడింది. ఇటీవల కేంద్రం రూ.11,440 కోట్లు, రాష్ట్రం తరపున మరో రూ.2 వేల కోట్లు ఆర్థిక సాయం అందడంతో పూర్తి ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉక్కు తయారీకి ఐరన్‌ఓర్ చాలా అవసరం. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా నుంచి ఐరన్‌ఓర్ వస్తుంది. రోజుకు ఎనిమిది ర్యాకులు అవసరం. ప్రస్తుతం ... మిగతా 4వ పేజీలో



కౌన్సెలింగ్ కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులు

ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

తొలిరోజు 300 మందికి స్థానచలనం

- నేడు 301 నుంచి 800 వరకూ...

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల) బదిలీ కౌన్సెలింగ్ బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. జడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమైన కౌన్సెలింగ్ విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షణలో కొనసాగింది. బదిలీలకు సంబంధించి ఎస్జీటీలతో రూపొందించిన సీనియారిటీ జాబితాలో ఒకటి నుంచి 300 వరకు టీచర్లకు బదిలీ చేశారు. ప్రతి టీచర్‌ను పిలిచి వారికి కొన్ని స్కూళ్ల వివరాలు చూపిస్తున్నారు. అందులో ఆప్షన్‌గా ఎంచుకున్న స్కూల్‌కు బదిలీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ బుధవారం రాత్రి 10.30 గంటల వరకు కొనసాగింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభం కావాలి. అయితే సాంకేతిక సమస్య కారణంగా కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించారు. గురువారం సీనియారిటీ జాబితాలో 301 నుంచి 800 వరకు అంటే 500 మందికి బదిలీలు నిర్వహిస్తారు.

బదిలీ టీచర్లకు ఆన్‌డ్యూటీ సౌకర్యం

గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నిబంధనల మేరకు ప్రతి టీచర్ పునఃప్రారంభం రోజున విధిగా స్కూల్‌కు హాజరుకావాలి. అయితే గురువారం నిర్వహించనున్న బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే టీచర్లకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించారు. ఒకవేళ ఒక స్కూల్‌లో ఇద్దరు టీచర్లు కౌన్సెలింగ్‌కు వస్తే సమీపంలోని పాఠశాలలో పనిచేసే ఎంటీఎస్ టీచర్‌కు సదరు పాఠశాల నిర్వహణ బాధ్యత అప్పగించాలి. ఈ విషయాన్ని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీలో ఎన్‌ఎంయూఏ సమ్మె నోటీస్

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడులకు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు బుధవారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 25 తేదీ తరువాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. డ్యూటీ చేసిన తరువాత కార్మికులకు తొమ్మిది గంటల పాటు విశ్రాంతి ఉండాలని, తదితర డిమాండ్లతో వంద రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేసినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తాము సమ్మెకు దిగాల్సి వస్తుందని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. -4లో



ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి అప్పలనాయుడుకు సమ్మెనోటీసు అందజేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ నాయకులు

తాత్కాలిక రెడ్‌జోన్‌గా ఆర్కే బీచ్‌రోడ్డు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలోని బీచ్‌రోడ్డులో జరిగే వేడుకకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానుండడంతో పోలీసులు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా బీచ్‌రోడ్డుని తాత్కాలిక రెడ్‌జోన్‌గా ప్రకటించారు. కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకూ ఈనెల 17 నుంచి 21 వరకు డ్రోన్‌లు ఎగురవేయడంపై నిషేధం విధించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ 1974 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రతబాగ్చి హెచ్చరించారు.


ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి

రహదారి ధ్వంసంపై జడ్సీ ఆగ్రహం

కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎండాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ ముబారక్ కాలనీలో రహదారిని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని జోన్ - 2 కమిషనర్ కనకమహాలక్ష్మి అధికారులను ఆదేశించారు. రహదారిని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. రోడ్డును తవ్వడంతో పాటు అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా లైనుకు విఘాతం కల్పించడం, జీవీఎంసీ తాగునీటి సరఫరా పైపులను పగలకొట్టిన వైనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లను పునరుద్ధరణతో పాటు తాగునీటి సరఫరా పైపులైన్లకు మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు.

22న గీతంలో ప్రవేశాలకు పరీక్ష

సాగర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025)ను దేశ వ్యాప్తంగా 42 పట్టణాల్లో నిర్వహించనున్నట్టు గీతం అడ్మిషన్ల డైరెక్టర్ ఎం. జగదీశ్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, హ్యూమనిటీస్, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 22న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే, ఆ కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వాస్తవానికి ఆయన పుట్టినరోజు గురువారం అయినప్పటికీ వేరే ప్రాంతానికి వెళ్లనుండడంతో ముందస్తుగా వేడుకలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృసింహ వనంలో ఏరువాక ఉత్సవం

సింహాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురంలో సింహాచలం దేవస్థానానికి చెందిన నృసింహవనంలో ఏరువాక ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈఓ వేంద్ర త్రినాథరావు నాగలికి, కాడెద్దులకు పండితుల సారధ్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమతంలో నాగలిపట్టి దుక్కిదున్నారు. వనంలో పని చేసే రైతు ఈఓ దున్నిన సాలులో విత్తనాలు చల్లారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది వాసు, అర్చకస్వామి సంతోష్‌శర్మ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయశాఖ
ఇ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు (2nd Call)

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా శ్రీ రామాలయము, తునివలస గ్రామము, పద్మనాభం మండలం, విశాఖపట్నం జిల్లా నందు దేవాలయమును పునర్ నిర్మించుటకు రూ.60.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు
కార్యనిర్వాహక అధికారి
ఫోన్స్ : 9550515222, 9603736026

నేడు తునిపాలంలో ముత్యాలమ్మ పండగ

పద్మనాభం రూరల్ : మద్ది పంచాయతీ తునిపాలం గ్రామ దేవత ముత్యాలమ్మ పండగ గురువారం జరగనుంది. ఏటా జూన్‌లో మృగశిర కార్తెలో ఈ పండగ చేయడం ఆనవాయితీ.

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి॥ నెం.బి.1818
ప్రధాన కార్యాలయము, మర్రిపాలెం, విశాఖపట్నం-09
ఫోన్ నెం.2788612 & 2788611.

62వ మహాజన సభ నోటీసు

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి॥ విశాఖపట్నం యొక్క మహాజన సభ సమావేశము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘముల చట్టం సెక్షన్ 32 (1) ప్రకారము తే.18-06-2025ది బుధవారం ఉదయం 11.00 గం॥లకు ఉడా లే అవుట్, మర్రిపాలెం, విశాఖపట్నంలో గల బ్యాంకు కేంద్ర కార్యాలయము నందు జరుపబడును. కావున సభ్యులందరు సదరు మహాజన సభకు తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

స్థలం : విశాఖపట్నం
తేది : 02-06-2025
టు,
అందరు సభ్యులకు ....

పర్సన్-ఇన్-ఛార్జ్ వారి అనుమతితో
సం/- డి.వి.ఎస్. వర్మ
ముఖ్యకార్యనిర్వహణాధికారి

గమనిక : 1. మహాజన సభకు సంఘ పర్సన్-ఇన్-ఛార్జ్‌లు మాత్రమే హాజరు కావలెను.
2. మధ్యాహ్నం గం.2.00లకు లంచ్ ఏర్పాటు చేయడమైనది.

శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం
సింహాచలం, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 99591 16669

సీల్డ్ టెండరు ప్రకటన
ఆర్.సి.నెం.జి4/2/2025, తే.11.06.2025

శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, దేవస్థానమునకు చెందిన శ్రీ స్వామి వారి కృష్ణాపురం గోశాల నందు ఉన్నట్టి వంటి గోవుల నుండి లభించిన పాలు గోమయము మరియు గోమూత్రమును ప్రోగుచేసుకొనిటకు ఒక సంవత్సర కాలమునకు అనగా అప్పగింత తేది నుండి తీసుకొనిపోవుటకు సీల్డు టెండర్లు పిలువబడుచున్నవి. టెండరు షెడ్యూలు తీసుకొనుటకు తేది.23-06-2025 నుండి 28-06-2025 వరకు సాయంత్రం 5.00 గం.ల లోపు పొందవలెను, తదుపరి తేది 30-06-2025 న సింహాచలం దేవస్థానం కార్యాలయం నందు గల టెండర్లు బాక్సు నందు ఉ.11.00 గం.ల లోగా వేయవలెను. తదుపరి వచ్చిన టెండర్లు స్వీకరింపబడవు. సదరు టెండర్లు అదేరోజు మ॥ 3.00 గం.ల కు టెండరుదారుల సమక్షములో తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యలయం పనిచేయువేళల యందు సంప్రదించవలెను.

సం/- వి.త్రినధరావు
కార్యనిర్వాహణాధికారి

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్ 2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTIONDATE 21.06.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO-14-1-2/B,GROUND FLOOR,NOWROJI ROAD,MAHARANI PETA, VISAKHAPATNAM - 530002.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CHWTRPJ2412110002	SUKUMAR BENNY CHEEDI	MRNPTPJ2412260002	ARAVIND TEDDU
CHWTRPJ2412140001	POTTI YERNI RAJU	PNRTHPJ2412050001	RONGALI CHANDRA SEKHAR
CHWTRPJ2412230008	PEDDOJU BETSHBARANI		
VZGCTPJ2412110002	SRINIVAS KATAPALLI	PNRTHPJ2412260001	SRINU AKKIREDDY
MRNPTPJ2412070005	VASU BANGARI	VIZA2PJ2409210003	RAMESH SUSARLA
MRNPTPJ2412070006	JAGADISH IDADASARI	VIZA2PJ2409300002	RAJU PONNADA
MRNPTPJ2412120002	KANAKADURGA GARIKINA	VIZA2PJ2409300004	RAJU PONNADA
MRNPTPJ2412260004	RAMU PATNANA	VIZA2PJ2409300003	RAJU PONNADA

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ ఎ.జగదీష్ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.06.2025
స్థలం: విశాఖపట్నం

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం వద్దు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, ఎండాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సన్ క్యాంపస్ నుంచి ఎండాడ మెయిన్ రోడ్డు వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సీసీపీ ప్రభాకర్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మితో కలిసి బుధవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగర్‌నగర్ నుంచి రుషికొండ వరకు బీచ్ రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు 1.9 కిలో మీటర్ల పొడవున ఇంటర్ కనెక్టింగ్ రోడ్డును 60 అడుగులకు విస్తరించడానికి రూ. 7 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. రోడ్డు విస్తరణకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించాల్సి ఉందని, నష్టపోయే స్థలానికి నిబంధనల ప్రకారం టీడీఆర్‌లు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. అలాగే రాడిసన్ బ్లూ ఎదురు రోడ్డు నుంచి ఎండాడ మెయిన్ రోడ్డు వరకు ప్రతిపాదించిన వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా గంటా పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బేసిక్ పాఠశాలగా కొనసాగించాలని వినతి

పద్మనాభం : ఇసకపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలగా కొనసాగించాలని ఆ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ హంస జ్యోతి, బీజేపీ సీనియర్ నాయకుడు మహేష్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. బుధవారం వారు ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి కేవలం ఒకటి, రెండు తరగతులతో ఫౌండేషన్ పాఠశాలగా గుర్తించి గ్రామంలోని 3,4,5 తరగతుల విద్యార్థులను పద్మనాభంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారన్నారు. కిలోమీటరు దూరం చిన్నపిల్లలు బ్యాగులతో నడచి రావడం కష్టమవుతోందన్నారు. తమ గ్రామంలోనే ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండేలా చూడాలని కోరారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అధికారుల తీరుపై సభ్యుల అసహనం

వాడీవేడిగా భీమిలి మండల సమావేశం

భీమునిపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తీరు పట్ల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి వాసు రాజు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయానికి రైతులు నెలలు తరబడి తిరుగుతున్నా.. సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు మాట్లాడుతూ అసలు రీసర్వే ఏ ప్రాతిపదికన చేస్తున్నారో అర్థం కావడం లేదని,అన్ని సర్వే నంబర్లను జాయింట్ హక్కుదారులుగా పేర్కొనడంతో గ్రామాల్లో కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ దశలో ఎంపీపీ వాసురాజు జోక్యం చేసుకుని తన భూములకు కూడా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు.ఆర్ఐ మల్లేశ్వరరావు స్పందిస్తూ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకువెళతానని చెప్పగా జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు జోక్యం చేసుకుని ఆయనకు చెబితే సమావేశానికి మీరెందుకు వచ్చినట్టు అని ప్రశ్నించారు. మండల సమావేశాలకు తహశీల్దార్ ఎందుకు రావడం లేదని అడిగారు. పంచాయతీరాజ్ చట్టంలో ఎన్ని పనులున్నా మండల సమావేశాలకు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టంగా ఉందని, కానీ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని ఆయా కార్యాలయాల కింది స్థాయి ఉద్యోగుల వల్ల ప్రయోజనం ఏముందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యానవన, సాంఘిక సంక్షేమ శాఖ, తదితర శాఖాధికారులు గైర్హాజరైనట్టు అధికారులు తెలపడంతో వారందరి విషయాన్ని నోట్ తయారు చేసి కలెక్టర్‌కు నివేదించాలని కోరారు. నారాయణరాజుపేట, విజయరాంపురం, లక్ష్మీపురం, చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, పాతపాలెం సభ్యులు కూడా పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్ద రుషికొండలో కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలు

సాగర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని పెద్ద రుషికొండ వద్ద గురువారం కారు బోల్తా పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. పిఠాపురం కాలనీకి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు భీమిలివైపు విహారానికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా పెద్ద రుషికొండ వద్ద కుక్కను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో తల్లిదండ్రులతో పాటు ఇద్దరు కుమార్తెల్లో ఒకరికి గాయాలయ్యాయి. వారిలో కుమార్తె సాయిశ్రీ (20)కి తీవ్ర గాయా లు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ

సింహాచలం,జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి మూడో చందనాన్ని బుధవారం సమర్పించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ పండితుల వేద పఠనాల నడుమ అర్చకులు మూడు మణుగుల చందనపు ముద్దను స్వామికి పైపూతగా అద్దారు. దానిపై పట్టు పోత్తువస్త్రాన్ని చుట్టారు. ప్రభాతారాధనల్లో భాగంగా విశేష పూజలు చేశారు. ఆస్థాన మండపంలో ప్రత్యేక కలశాలు ఏర్పాటు చేసి వాటికి పూజలు చేశారు. ఏటా అప్పన్న స్వామికి నాలుగు విడతలుగా చందనం సమర్పించడం ఆనవాయితీ. ఇప్పటికే రెండు విడతలు పూర్తి కాగా బుధవారం తెల్లవారుజామున మూడో విడత చందనాన్ని సమర్పించారు.


చందనం కిరీటంతో గోవిందరాజస్వామి

యువకుడిపై కత్తితో దాడి

సింహాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వరాహ పుష్కరిణి ఒడ్డున యువకులు మద్యం సేవించడాన్ని వారించిన యువకుడిపై నలుగురు కత్తితో దాడి చేశారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఆరిలోవ ప్రాంతానికి చెందిన గుడివాడ గణేష్ (26), పీతల అప్పలరాజు (25) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రాత్రి 11 గంటల సమయంలో వరాహ పుష్కరిణి ఒడ్డున మద్యం సేవించారు. వారంతా బిగ్గరగా అరుస్తూ.. కేకలు వేస్తూ పరిసర ప్రజలకు ఇబ్బంది కలిగించారు.అదే సమయంలో 98వ వార్డు సింహగిరి ఘాట్ రోడ్డు ప్రాంతానికి చెందిన బోర దినేష్‌రెడ్డి (24) అటుగా వెళ్లి పరిస్థితిని గమనించి వారిని మందలించాడు. ఈ తరుణంలో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న గణేష్ సమీపంలో ఉన్న ఆటోలోని కత్తి తీసుకువచ్చి దినేష్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు దినేష్‌రెడ్డిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు గణేష్, తప్పలరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్రికెట్ పోటీల విజేత రెడ్‌స్టార్ టీమ్

సింహాచలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మ పండగ పురస్కరించుకుని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్పొరేటర్ క్రికెట్ కప్ విజేతగా కాపువీధికి చెందిన రెడ్ స్టార్స్ జట్టు నిలిచింది. విజేత జట్టుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు షీల్డ్‌ను, 15 వేల చెక్కు అందించారు.

సీఎం రాక రేపు

... 3వ పేజీ తరువాయి

ఎరీనాకు వెళతారు. ఆరు గంటల వరకూ పలు పరిశ్రమలకు సంబంధించిన శిలాఫల కాలు ఆవిష్కరిస్తారు. అక్కడే పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, తరువాత వర్చువల్‌గా ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అక్కడ నుంచి ఆరు గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. ఆయా ప్రాంగణాలు, వేదికలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత కలిసి బుధవారం పరిశీలించారు. కొన్ని అత్యవసర పనులు వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఏపీ ఈఏపీసీఈటీ ఫలితాల్లో శ్రీవిశ్వ విద్యార్థుల విజయభేరి

సీతంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :విడుదలైన ఏపీ ఈఏపీసీఈటీ 2025 ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. విశాఖపట్నం విద్యా సంస్థ శ్రీవిశ్వ విద్యార్థులు ఎంపీసీ, బైపీసీలలో సాధించిన ర్యాంకుల వివరాలివి. జి.గురుచరణ్ 147, సీహెచ్ఎం సాయి సాకేత్ 160, ఎస్.నాగ లలిత శ్రావ్య 191, బి.వర్షిణి 184, బి.శ్రావణి 259, జి.ఉషాశ్రీ 396, షేక్ నిజాముద్దీన్ 343, కె.వి.కుటుంబ నిహార్ 383, సీహెచ్ వెంకట హేమ వర్ధన్ 472, యు.జయంత్ కుమార్ 519, ఎం.రాజేష్ 528, డి.అజయ్ 553 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు ర్యాంకులు 28 మంది, ఐదు వేల లోపు 162 మంది, పది వేల లోపు 320 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీవిశ్వ విద్యా సంస్థల ఛైర్మన్ కె.ధర్మరాజు ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ క్రికెట్ స్టేడియం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మిథిలాపురి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. రెవెన్యూ లేఅవుట్, వెంకటేశ్వరస్వామి టెంపుల్ సమీపంలోని ఎన్‌టీఆర్ బ్లాక్‌లు, తారకరామానగర్, సూర్యశక్తినగర్, ఎంవీవీ రోడ్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

రెన్యువబుల్ ఎనర్జీపై వర్క్‌షాపు రేపు

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని నోవాటెల్‌లో రెన్యువబుల్ ఎనర్జీపై శుక్రవారం సౌత్ జోన్ రీజనల్ వర్క్‌షాపు జరగనుంది. న్యూ అండ్ రెన్యువబుల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ వెంకటేశ్ జోషి, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, కర్నాటక రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతినిధులు, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పాల్గొనున్నారు. అలాగే ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, నెడ్ క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్‌బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు హాజరవుతారు. సదస్సు నిర్వహణ బాధ్యతను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు.

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి గురువారం నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. రైతులు నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి అందిస్తామన్నారు.జిల్లాలో 582 ప్రభుత్వ పాఠశాలలకు, 70 సంక్షేమ వసతి గృహాలకు వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలకు చేరిన బియ్యం సంచులకు అమర్చిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే రైతు, మిల్లు, ఇతర వివరాలు వస్తాయన్నారు.

కూటమి పాలనపై సానుకూలత

... 3వ పేజీ తరువాయి

చాలా బాగుందని కృష్ణా కాలేజీ ప్రాంతానికి చెందిన దాక్షాయణి అనే గృహిణి పేర్కొన్నారు.

మిశ్రమ స్పందన అందుకే..

కొన్ని సంక్షేమ పథకాలను ఇంకా అమలు చేయకపోవడంపై అసంతృప్తి ఉన్నా, కొన్ని నిర్ణయాలను మాత్రం కొన్నివర్గాలు సమర్థిస్తున్నాయి. సంక్షేమ పథకాలన్నీ అమలు చేయకపోయినా, ఉచిత గ్యాస్ సిలిండర్ ఇచ్చారని జగదాంబ సెంటర్ ప్రాంతానికి చెందిన ఎం.లక్ష్మి అభిప్రాయపడ్డారు. తల్లికి వందనం, ఇతర పథకాలు కూడా అమలు చేస్తే బాగుంటుందని, ఏడాది పాలన పర్వాలేదన్నారు. కోట్లాది రూపాయలు అప్పులు చేసి రాజధానికే పెడుతున్నారని, మిగిలిన ప్రాంతాలపై దృష్టిసారించాలని ప్రైవేటు ఉద్యోగి తాలాడ శివకృష్ణ పేర్కొన్నారు. అయితే పాలనలో మాత్రం పారదర్శకత పెరిగిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా అప్పులు చేస్తోందని, అయితే అభివృద్ధిని మాత్రం పరుగులు పెట్టించేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని సీతమ్మధారకు చెందిన నరసింహ అన్నారు.

ఈ నిర్ణయాలపై వ్యతిరేకత..

సంక్షేమ పథకాలను ఇంకా పూర్తిగా అమలు చేయకపోవడంపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని, ఫైన్లు వేయడమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని ఆటో డ్రైవర్ లక్ష్మణరావు పేర్కొన్నాడు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదని రాజేంద్రప్రసాద్ వెల్లడించాడు. నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారో గుర్తించే ప్రక్రియను కూడా చేపట్టలేదని,మరి నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించాడు. ప్రజలకు స్కీమ్స్ అందిస్తే వ్యాపారాలు జరుగుతాయని, పాలన ఆశించిన స్థాయిలో లేదని కె. రాజు అనే వ్యాపారి అసంతృప్తి వ్యక్తంచేశారు.

నేటి నుంచి పాఠశాలలు

(3వ పేజీ తరువాయి)

ప్రాథమిక పాఠశాలలు, 21 యూపీ, 76 ఉన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్, ఐదు ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు మొత్తం 563 ఉంటాయి. కాగా గత ప్రభుత్వం అమలుచేసిన నాడు-నేడు పథకం (ప్రస్తుతం మన బడి-మన భవిష్యత్తు) కింద చేపట్టిన నిర్మాణాలు కొంతవరకూ అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు రూ.23 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి విడుదలైతే 460 గదులు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంచనావేస్తున్నారు. ఇదిలావుండగా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌తో జిల్లాలో చాలా పాఠశాలల టీచర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా టీచర్లు రానున్నారు. వీరి ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యార్థులు చేరికకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేయనున్నారు.

ఉక్కు దూకుడు

... 3వ పేజీ తరువాయి

వర్షాకాలం. కిరండోల్ లైనులో కొండ చరియలు విరిగి పడి రైళ్ల రాకపోకలు ఆగిపోతుంటాయి. అటువంటి పరిస్థితి ఎదురైనా బ్లాస్ట్‌ఫర్నేస్‌లు ఆగకుండా ఉండేందుకు తగిన నిల్వలు ఉంచుకోవాలి. రైల్వేపరంగా ర్యాకులను అవసరమైనన్ని సమకూర్చాల్సి ఉంది. ఐరన్‌ఓర్ అవసరమైనంత లేకుంటే దానికి బదులుగా పెల్లెట్లు వినియోగిస్తారు. ఇవి ఖరీదైనవి. టన్నుకు రూ. 5 వేలు అదనపు వ్యయం అవుతుంది. కాకపోతే మరింత నాణ్యమైన స్టీల్ తయారవుతుంది. ముందుచూపుతో యాజమాన్యం 1.5 లక్షల టన్నుల పెల్లెట్లను ముందుగానే కొనుగోలు చేసింది. టన్నుకు రూ.10,500 వెచ్చించింది. ఈ ధర ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుంది. అలాగే పూర్తి ఉత్పత్తికి రోజుకు 13 వేల టన్నుల కోక్ అవసరం. అవసరమైన కోకింగ్ కోల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కోక్ ఓవెన్ల ద్వారా రోజుకు 410 పుష్‌లు తీయాల్సి ఉంటుంది. కోక్ ఓవెన్ బ్యాటరీలు ఐదు ఉండగా, వాటిలో 1,3 బ్యాటరీలకు నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. ఆ పనులు పూర్తి చేయడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. ఆ పనులు చేపట్టకుండానే పూర్తి ఉత్పత్తికి యత్నిస్తున్నారు. అది సాధ్యం కాదని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. 370-380 పుష్‌లకు మించి రావని అంటున్నారు. ఇవి పూర్తిస్థాయిలో పనిచేయకపోతే రోలింగ్ మిల్స్ నడపడానికి అవసరమైన గ్యాస్ ఉత్పత్తి కాదు. ఆ పరిస్థితి ఉత్పన్నమైతే వాటిని కొంత సమయం ఆపి, మళ్లీ ప్రారంభించాల్సి ఉంటుంది. దీనిని డౌన్ అండ్ అప్‌గా వ్యవహరిస్తారు. రోజూ ఇదే విధంగా వాటిని నడిపితే రిఫ్రాక్టరీ వ్యవస్థ దెబ్బతింటుంది. అసలుకే మోసం వస్తుంది.

తగ్గిపోయిన సిబ్బంది

స్థిర వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పి కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తొలగించేశారు. వారిలో నైపుణ్యం కలిగిన వారూ ఉండడం వల్ల ఇప్పుడు ప్లాంటును పూర్తిస్థాయిలో నడపడానికి ఇబ్బందులు వస్తాయి. కొన్ని కీలక విభాగాల నిర్వహణను కాంట్రాక్టుకు ఇచ్చినా వారు పూర్తిస్థాయిలో పనిచేస్తారనే విశ్వాసం లేదు. అధికారులను రోజుకు 12 గంటలు పని చేయిస్తున్నారు. ఇలా ఎన్నాళ్లు తాము చేయగలమని ప్రశ్నిస్తున్నారు. సరైన యాజమాన్యం లేకపోవడం వల్లనే స్టీల్‌ప్లాంటు నష్టాల్లోకి వెళ్లిందని ప్రకటించిన కేంద్రం ఇప్పటికీ దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా పూర్తి ఉత్పత్తికి వెళ్లడం ఏ విధంగా సమంజసమని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. తమ వైపు పూర్తి సహకారం ఉంటుందని సంఘాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. జీతాలు ఇవ్వకున్నా పనిచేస్తున్నామని, హెచ్‌ఆర్‌ఏ కట్ చేసినా మిన్నకున్నామని, విద్యుత్ చార్జీలు పెంచినా కడుతున్నామని, సిబ్బందిని వేల సంఖ్యలో తీసేసినా ధర్నాలు చేయవద్దంటే చేతులు కట్టుకొని ఉన్నామని, ఇంతకంటే ఇంకేమి చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా యాజమాన్యానికి సహకారం కాదా? ఇప్పటికీ విశ్వసించరా? అంటూ వాపోతున్నారు. తోటి పనివారిని ఉద్యోగం లోనుంచి తీసేస్తే దానిని కూడా ప్రశ్నించకూడదంటే...ఇక ప్రజాస్వామ్యానికి అర్థం ఉందా? అని మథనపడుతున్నారు.

రేపటి నుంచి స్టూడెంట్ బస్ పాసులు జారీ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని అన్ని డిపోలు, బస్ స్టేషన్‌లోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్టూడెంట్ బస్ పాసులను శుక్రవారం నుంచి జారీ చేయనున్నట్టు రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. మధురవాడ, మద్దిలపాలెం, వాల్తేరు, ద్వారకాబస్‌స్టేషన్, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం, ఎంవీపీ కాలనీ కాంప్లెక్సులోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్టూడెంట్ బస్ పాస్‌లు జారీ చేస్తామని వెల్లడించారు. ఈ కౌంటర్లు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పని చేస్తాయని, ఏపీఎస్ ఆర్టీసీ పాస్.ఇన్‌లో విద్యార్థుల వివరాలు, ఫొటో నమోదు చేసి దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకొని, దానిపై సంబంధిత పాఠశాల హెచ్‌ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకం చేయించుకోవాలన్నారు. ఆధార్ జెరాక్స్ కాపీ జత చేయాలని సూచించారు. 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగానే బస్సు పాసులు జారీ చేస్తామన్నారు.



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PAPALA KUMARI (Old Name) W/o. Papala Trinadha, Resident of: FNO:302, Sri Lakshmi Residency, Kothavalasa, Vizianagaram. Change my Name from PAPALA KUMARI (Old Name) to PALLI KUMARI (New Name) hence forth I am being called as PALLI KUMARI (New Name) all purposes.
AJV_241668

LOSS OF PASSPORT

★ I, PILLA PAVAN S/o Pilla Pydi Raju R/o. D. No. 5 - 3 - 39E, Near Waltair Bus Depot, Peda Jalaripeta, Visakhapatnm - 530017. I have lost my Original Pass Port (No. V5436117) on 25-5-2025, while doing work painting works at home and i shipting the house articles. If anybody found please contact : 7731829292
AJV_231681

ఉద్యోగావకాశాలు

➾ Sunanda Group Conducting Recruitment drive QR Technicians : (1) ITI / Diploma : Electrical / Electronics / Mechanical, Engineers : (2) B.Tech / M.Tech : E.E.E / E.C.E / Mechanical, FRESHERS ALSO WELCOME Venue : Sunanda Renewable Energies Pvt.Ltd, Banjarahills, Hyderabad. Email : hr@sunandagroups.com, 8919081981, 7207705666.
AJG-2275

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

జనరంజక పాలన



కూటమి ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల మనోగతం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వివిధ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. పరిపాలన గాడిలో పడిందని, వివిధ వర్గాలకు మేలు చేకూరుతోందని సంతోషం వ్యక్తంచేశారు. వ్యవసాయానికి మరింత చేయూత, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి నిలపడం, మిగిలిపోయిన పేద వర్గాలకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయడం అవసరమని సూచించారు. పాలనపై ఎవరు ఏమన్నారంటే....

కూటమి పాలన భేష్



అక్కయ్యపాలెం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన చాలా బాగుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తోంది. గెలిచిన వెంటనే డీఎస్సీ నియామకాలపై మొదటి సంతకం చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు బ్యాంకు ఖాతాలో వేయడానికి నిర్ణయించడం హర్షణీయం. మరో నాలుగేళ్ళు కూడా సుపరిపాలన అందించాలని కోరుతున్నాం.

-సోరంపూడి జయ, శ్రీనివాసనగర్, అక్కయ్యపాలెం

నిరుద్యోగ భృతి ఇస్తే యువతకు ఆసరా



రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ఉపాధి కల్పనకు పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావటం మంచి విషయం. అయితే ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది. ఉపాధి లభించే వరకు యువతకు ఆర్థిక భరోసా అవసరం. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయటానికి చర్యలు తీసుకోవాలి.

- జి.రేణుక, గాజువాక

ఒకే ఏడాది అన్నీ అసాధ్యం



ప్రభుత్వ పనితీరు చాలా బాగుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంతి చంద్రబాబు చాలా కృషి చేస్తున్నారు. ఉదయం ఆరోగంటకు పింఛన్ వస్తుంది. మరికొన్ని రోజులలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లభించనుంది. అన్నీ ఒకే ఏడాది అమలు చేయాలంటే ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు. ఎలాంటి భేషజాలకు పోకుండా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం అందిస్తున్నారు.

- కోస్టు శ్రీనివాస్, అకౌంటెంట్, మహారాణిపేట:

సంక్షేమం, అభివృద్ధి సమతూకం



ఆనందపురం: కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు వెళ్తోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే సంక్షేమం, అభివృద్ధి సమానంగా నడిపిస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి శూన్యం. ఏ ప్రభుత్వం వచ్చినా వ్యాపారులకు చేసింది మాత్రం ఏమీ లేదు.

-ఎన్ని మాధవరావు, వ్యాపారి, ఆనందపురం

వేధింపుల నుంచి విముక్తి



ప్రభుత్వం మారడంతో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. గత ప్రభుత్వంలా ప్రజలకు వేధింపులు, భయానక వాతావరణం లేకపోవడంతో ప్రశాంతంగా ఉండగల్గుతున్నారు. అనవసర ఖర్చులు తగ్గించి నిదానంగా పరిపాలన జరుగుతుంది. ఇచ్చిన హామీలను కూటమి నాయకులు నెరవేర్చుతారనే నమ్మకం ప్రజలకు ఉంది. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి పొందుతుందన్న నమ్మకం ఉంది.

- చొల్లంగి వెంకటేశ్వర్రావు, వ్యాపారి, కంచరపాలెం

ఉద్యోగుల ఇబ్బందులపై దృష్టి సారించాలి



ప్రస్తుత ప్రభుత్వ పనితీరు బాగుంది. ఏ ప్రభుత్వంలో అయినా ఉద్యోగి సంతృప్తి చాలా అవసరం. ఆ విషయంలో ఈ ప్రభుత్వం కొంత విజయం సాధించినా, మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. వాటిని ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నాం.

-కోలా బంగారయ్య, ఏయూ ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

బాగానే చేస్తున్నారు



ప్రభుత్వ పాలన పర్వాలేదు. పెంచిన పింఛన్లు, గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం ఇస్తున్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారు. అన్ని హామీలు ఒకేసారి చేయాలంటే డబ్బు ఉండాలి కదా.. జగన్ పెట్టిన అప్పులు తీరుస్తూ సంక్షేమ పథకాలు ఇస్తున్నారు.

-కాసరపు పెంటయ్య, మత్స్యకారుడు, భీమిలి

ప్రభుత్వ నిర్ణయాలు మేలు చేస్తున్నాయి



ప్రజలను పాలించాలంటే అనుభవం ఉండాలి. అనుభవం లేని నాయకుల చేతుల్లోకి పాలన వెళ్తే గందరగోళంగా ఉంటుంది. ఏడాదిగా ఎలాంటి గందరగోళం లేదు. కొత్త ప్రభుత్వం రాగానే రూ.4 వేలకు పింఛన్ పెంచి మమ్మల్ని ఆదుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో ఉంటాం. రేషన్ తీసుకోవాలంటే ఒక రోజు పనికి వెళ్లడం మానేయాల్సి వచ్చేది. ఈ నెల ఆ పరిస్థితి లేదు. సాయంత్రం పని నుంచి వచ్చి రేషన్ డిపోలో సరుకులు తీసుకున్నాం. ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మాకు ఉపయోగకరంగా ఉన్నాయి.

-కె.సీతయ్య , భవన నిర్మాణ కార్మికుడు, మద్దిలపాలెం

మధ్యతరగతి గురించి ఆలోచించాలి



కిందిస్థాయి వారికీ, ఉన్నత వర్గాలకు బాగానే ఉంది. ప్రతిసారీ ఇబ్బందులు పడుతున్నది మధ్య తరగతే. ఏ పథకాలూ ఉండవు. ఓ పక్క పన్నుల భారం, మరో పక్క నిత్యావసరాలు, ఇతరత్రా భారీగా ధరలు పెరిగిపోతున్నాయి. వీరికి మేలు చేకూరే విధంగా మరో స్లాబుకు రూపకల్పన చేసి, అమలు చేస్తే ఆనందంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

- ఎంవీ .అప్పలరాజు, ప్రైవేటు ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

సాగుకు సాయం అందజేయాలి



రాష్ట్రంలో ప్రభుత్వ పాలన బాగానే ఉంది. అయితే రైతు సాగుకు సాయం అందేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలి. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయం వర్షాధారం కావడంతో పంట కాలువల్లో పూడిక తీయించి సాగు నీరు అందించేలా చేయాలి, ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించాలి. ట్రాక్టర్లు సబ్సిడీపై అందజేయాలి.

- వెన్నెల పెంటబాబు, రైతు, పెందుర్తి

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పటి వరకు కూటమి ఏలుబడి బాగానే ఉంది. నాకు పింఛను పెద్ద ఆధారం. ఈ ప్రభుత్వం పింఛను పెంచడంతో ఎంతో ఉపయోగంగా ఉంది. కొత్తగా పింఛన్లు ఇవ్వకపోవడంతో నాలాంటి ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవారికి మంజూరు చేస్తే ప్రభుత్వంపై విమర్శలు రావు.

- ఆడారి రామకృష్ణ, రోజువారి కార్మికుడు, జ్ఞానాపురం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం



ఈ ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోంది. దానికి అనుగుణంగా ఆర్థిక అభివృద్ధిని సాధిస్తూ సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రజల ఆకాంక్షల మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు కూడా ప్రభుత్వాన్ని జోడు గుర్రాల్లా పరిగెత్తిస్తూ ప్రభుత్వం ప్రజల మన్నన పొందుతోంది.

-ఉప్పాడ విజయలక్ష్మి, గృహిణి, సింహాచలం



ఆలయ ఈవో ప్రసాదరావుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మధుసూదన్ ప్రభు

సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం

సిరిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీసంపత్ వినాయగర్ ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యులు భారీ విరాళం అందజేశారు. సంపత్ వినాయక స్వామివారి కార్పస్ ఫండ్ నిమిత్తం రూ.లక్ష చెక్కు రూపంలో బుధవారం దేవస్థానం సహాయ కమిషనర్, ఈవో డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 16, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 16, క్యారెట్ 44 దొండకాయలు 20, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, బద్దచిక్కుడు44, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీర దోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 32, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలి

» ఏయూ వీసీ రాజశేఖర్

» డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లకు నియామక ఉత్తర్వుల అందజేత

వెంకోజీపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని పలు విభాగాలకు నూతన డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లు రాబోతున్నారు. బుధవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో వీసీ జీపీ రాజశేఖర్ సమక్షంలో వీరందరికీ నియామక ఉత్తర్వులను రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అందజేశారు. మొత్తం 43 మందికి వివిధ పరిపాలన పదవులను అందజేశారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ నూతన బాధ్యతలను స్వీకరించిన ప్రతి ఒక్కరు విశ్వవిద్యాలయ అభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడాలన్నారు. విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించామని, త్వరలో నూతన కార్యక్రమాలను చేపట్టే విధంగా ప్రతి విభాగం పని చేయాలని సూచించారు. ఆయా విభాగాల్లో ఎక్కువ మంది సిబ్బందిని, ఆచార్యులను భాగస్వాములు చేస్తూ ప్రతీ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బందితో గౌరవప్రదంగా నడుచుకుంటూ ఏయూకు ఎప్పుడూ మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు.



నియామక పత్రాలు అందుకున్న డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లు

'యోగాంధ్ర'లో ఏయూ కీలక బాధ్యత పోషిస్తుంది

» 1200 మంది ట్రైనర్లను తీర్చిదిద్దుతున్నాం : వీసీ రాజశేఖర్

» ఏయూ ఉద్యోగులకు మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభం

వెంకోజీపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేదికగా ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఏయూ కీలక బాధ్యతలను పోషిస్తోందనిఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం బీచ్ రోడ్డు యోగా విలేజ్‌లో ఏయూ ఉద్యోగులకు మూడు రోజుల యోగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 1200 మంది ట్రైనర్లను తీర్చిదిద్దే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే అనుబంధ కళాశాలల్లో వెయ్యి మంది ట్రైనర్లను తయారు చేశామని, రానున్న రోజుల్లో మరికొంత మంది సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. 30 వేల మంది ఏకకాలంలో యోగా సాధన చేయడానికి అవసరమైన ఏర్పాట్లను ఏయూ మైదానాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం అనంతరం కూడా ప్రజలందరూ యోగాను సాధన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఏయూ ఉద్యోగులు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న బీచ్ రోడ్డు వేదికగా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, యోగా విభాగాధిపతి కె.రమేశ్‌బాబు, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణ పొందుతున్న వీసీ, ఏయూ సిబ్బంది

యోగా సాధన...

కార్యక్రమంలో భాగంగా ముందుగా సూక్ష్మ వ్యాయామం, వక్రాసనం, వృక్షాసనం, అర్ధహల ఆసనం, పవన ముక్తాసనం, సేతు బంధాసనం, భుజంగాసనం, శ లభాసనం, అనులోమ విలోమ ప్రాణాయామం, కపాల బాతిక్రియ, శీతలి, బ్రామరి ప్రాణాయామం, ధ్యానం వంటివి ఏయూ ఉద్యోగులు, విద్యార్థులతో చేయించారు.

బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన యూనిటీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెదవాల్తేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జీవ వైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా నగరంలో పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవీ ఆస్పత్రి అవరణలో గల బయోడైవర్సిటీ పార్కును బుధవారం యూనిటీ డిగ్రీ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ సందీప్ కోట అధ్వర్యంలో హెచ్ఆర్, శిక్షణ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్‌రాజు, ఉపాధ్యాయులు సాగర్ జ్యోతి, రూత్ క్రిస్టియన్, పుహా ప్రియ, ఎస్ జాన్‌బాబు సభ్యులతో పాటు 170 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులోని టానీ కోస్టర్ సీతాకోక చిలుక పూర్తి జీవిత చక్రాన్ని.. అన్ని దశలను పరిశీలించి ఆకర్షితులయ్యారు. అనంతరం జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల గురించి వివరించారు. సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను పరిశీలించారు. అనంతరం పార్కులో అరుదైన ఔషధ మొక్కలను నాటారు.



ఔషధ మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఘనంగా దేబస్నాన పూర్ణిమ

సిరిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా రేడియో కేంద్రం వద్ద ఉన్న ఉత్కల్ సంస్కృత్ సమాజ్‌లో కొలువైన జగన్నాథస్వామి ఆలయంలో దేబస్నాన పూర్ణిమను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున జగన్నాథుడు, బలభద్రుడు, దేవీ సుభద్ర దేవతలను ఆలయ గర్భగుడి నుంచి అలకరించబడిన స్నానవేదికకు తీసుకెళ్లారు. మంత్ర జపాల నడుమ పహండి అనే ఆచారంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు .సమాజ్ అధ్యక్షుడు గహపతి జేకే నాయక్ వేదికను శుభ్రం చేసిన అనంతరం స్నాన ఆచారం చేపట్టారు. దేవతలకు 108 కుండల సువాసన గల నీటితో స్నానం చేయించారు. తదుపరి గజాననుడి వస్త్రాలను అలకరించారు. తదుపరి భక్తులు దేవతలను దర్శనం చేసుకున్నారు. సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ మాట్లాడుతూ ఈ స్నానం కారణంగా స్వామివారికి జ్వరం వస్తుందని, దేవతలు అనసార అనే క్వారంటైన్ ఉంటారన్నారు. 14 రోజుల తరువాత కోలుకుంటారని ఈ నెల 25న ప్రసిద్ధ రథయాత్రకు బయలుదేరుతారన్నారు. కార్యక్రమానికి సెక్రటరీ బిమల్‌కుమార్ మహంత్, సభ్యులు, సేవకుల సహాయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గజాననుడి వస్త్రాల అలంకరణలో జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర

ఇంకుడు గుంతల నిర్మాణంపై బ్రోచర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాలనీ సంఘాల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన ఇంకుడు గుంతల నిర్మాణం, జల సంరక్షణ పుస్తకాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమాఖ్య ప్రతినిధుల ఆధ్వర్యంలో పన్నెండు పేజీల బ్రోచర్‌ను విడుదల చేశారు. గడచిన ఆరేళ్లలో సమాఖ్య చేపట్టిన ఇంకుడు గుంతల ప్రాజెక్ట్ వివరాలను ఇందులో పొందుపరిచారు. అలాగే తయారు చేసే విధానాన్ని ఇందులో వివరించారు. సమాఖ్య ప్రతినిధులు ఉదయ్, కేఎస్ఆర్ మూర్తి, దుర్గాప్రసాద్, శేషగిరి, మాధవరావు, కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురు యువకుల అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అమ్మకానికి యత్నించిన ముగ్గురు యువకులను ఎంవీపీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. అప్పుఘర్ వద్ద సముద్రతీరంలో ఉన్న శ్మశానవాటిక సమీపంలో ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ బాషా తన సిబ్బందితో అక్కడ మాటు వేశారు. నగరంలోని నక్కవానిపాలేనికి చెందిన బొర్రా వేణు (23), ఎరుసు మహేష్ (22), కేఆర్ఎం కాలనీకి చెందిన బక్కా మనోజ్ (19)లు పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించగా, అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రెండు గ్రాముల ఎండు గంజాయి, 50 గ్రాముల బరువుతో ఉన్న మరో మూడు ప్యాకెట్లు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ విజేత ఒడిశా



విజేత ఒడిశా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ఉక్కు స్టేడియంలో జరిగిన అంతరాష్ట్ర అంధ మహిళల క్రికెట్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఉదయం ఉక్కు స్టేడియంలో ఒడిశా- ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య ఫైనల్స్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 109 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. అనంతరం నిర్వహించిన ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమార్‌శర్మ విజేతగా నిలిచిన ఒడిశా జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ మహిళలు క్రికెట్ ఆడటం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఎన్టీపీసీ విశేష చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కూటమి ప్రభుత్వం ఏడాది పండుగ వేడుకలు

మద్దిలపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డులో గురువారం ఏడాది పండుగ వేడుకలు నిర్వహిసున్నట్టు టీడీపీ విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు మంగాపురం కాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించే ఈ వేడుకలకు స్థానిక కూటమి పార్టీల శ్రేణులు హాజరు కావాలని కోరారు. ముందుగా ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించే ర్యాలీకి వార్డు కార్యకర్తలందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. అలాగే సాయంత్రం 5 గంటలకు వెంకోజీపాలెం వుడా ఫంక్షన్ హాలులో నిర్వహించే ముఖ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బీసీలు, ముస్లింలు రాజకీయాల్లోకి రావాలి

» ఏఐబీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు

సిరిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బీసీలు, ముస్లింలు రాజకీయ వృత్తిలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని తద్వారా హక్కులను సాధించుకునేందుకు ఆస్కారం లభిస్తుందని ఏఐబీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్ జె. పూర్ణచంద్రరావు సూచించారు. బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని ఏఐబీఎస్పీ కార్యాలయంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ముస్లింలతో భవిష్యత్ కార్యచరణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ నలుపు రంగు దుస్తులను ధరించడం ద్వారా మన నిరసనను ప్రభుత్వానికి సూటిగా చెప్పే అవకాశం కలుగుతుందన్నారు. బీసీలు, ముస్లింలు కచ్చితంగా రాజకీయాల్లోకి రావాలన్నారు. అగ్రవర్ణాలకు నిరంతరం బీసీలు, ముస్లింలతో పని ఉంటుందని, అయితే బీసీలు, ముస్లింను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు తప్ప వారి హక్కులను నేరవేర్చడం లేదన్నారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు లకే రాజారావు, మహిళా కన్వీనర్ కె.లక్ష్మి, వై.శారద, ముస్లిం నాయకుడు అబ్దుల్ మనన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విమ్స్ 11 కేవీ రెవెన్యూకాలనీ ఫీడర్ నిర్వాహణలో భాగంలో పలు మరమ్మతు పనులు చేపడుతుండడంతో రెవెన్యూ కాలనీ, విశాలాక్షినగర్, చలపతినగర్, సంజీవినగర్, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, కైలాసగిరి రోడ్డు తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం: జేసీ

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 582 ప్రభుత్వ పాఠ శాలలు, 70 సంక్షేమ హాస్టళ్లకు గురువారం నుంచి అందజేస్తామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, తరువాత బియ్యాన్ని తునిలోని ప్యాకింగ్ యూనిట్‌కు చేరుస్తామని, అక్కడి నుంచి 25 కేజీల వంతున ప్యాకెట్ రూపంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మండల గోదాములకు తరలించే ప్రక్రియ జరుగుతోందన్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యాన్ని సరఫరా చేయనున్నట్టు జేసీ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌కు చేరిన 25 కేజీల బియ్యాన్ని సంచులకు అమర్చిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే రైతు, మిల్లు, ఇతర వివరాలు వస్తాయన్నారు. పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

రెన్యువబుల్ ఎనర్జీపై వర్క్‌షాపు రేపు

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నోవాటెల్‌లో ఈ నెల 13న రెన్యువబుల్ ఎనర్జీపై సౌత్ జోన్ రీజనల్ వర్క్‌షాపు జరగనుంది. న్యూ అండ్ రెన్యువబుల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతినిధులు, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పాల్గొంటారు. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, నెడ్‌క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు హాజరవుతారు. సదస్సు నిర్వహణ బాధ్యతను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు.

రైల్వే కో-ఆపరేటివ్ సొసైటీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్రన్ రైల్వే, సౌత్ ఈస్ట్రన్ సెంట్రల్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో గత బోర్డు డైరక్టర్లకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులకు ఉద్యోగాలు కల్పించడమే కాకుండా విధులకు హాజరుకాకపోయినా పూర్తి జీతం చెల్లించి సొసైటీ సొమ్మును దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై వివరణ కోరుతూ కొందరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని సొసైటీ చైర్మన్ ఎస్.పి.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందికి వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.30 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన రోషన్ ఆనంద్ అనే నిందితుడు గంజాయిని పుణేకు రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

▸▸ కలెక్టర్‌కు ఆర్టీసీ యూనియన్ల నోటీసు


కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న ఆర్టీసీ యూనియన్ల ప్రతినిధులు

మహారాణిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు స్పష్టంచేశారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏపీపీటీడీ, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆందోళన నిర్వహించి సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో నాలుగు నెలలుగా సిబ్బంది ఆందోళన చెందుతున్నారని, దాదాపు వంద రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నామని, సిబ్బంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన లేకపోవడంతో జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో చేసిన తీర్మానం మేరకు సమ్మె నోటీసు ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక డ్యూటీలు సరిచేయాలన్న ఆదేశాలకు భిన్నంగా సిబ్బంది ని సస్పెండ్ చేయడం, తొలగించడం వంటి చర్యలను ఖండించారు. ఇలాంటి ఉత్తర్వులు రద్దు చేయాలని, వివిధ రాష్ట్రాలలో అమలు చేసే విధంగా సిబ్బంది నుంచి టికెట్టు తీసుకొనే బాధ్యత ప్రయాణికులదే అన్న విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ వైద్య సదుపాయం వల్ల సిబ్బందికి అత్యవసర సమాయాల్లో వైద్యం సక్రమంగా అందటం లేదని, లక్షలాది రూపాయలు కట్టలేక చాలా మంది సిబ్బంది ప్రాణాపాయ స్థితిలోకి వెళ్తున్నారని, అందువల్ల ఆర్టీసీ సంస్థా పరంగా ఏర్పాటు చేసిన మెడికల్ కమిటీని పునరుద్ధరించాలని, మెడికల్ బిల్లులు చెల్లించాలని కోరారు. అధికారులు వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 తరువాత ఏ సమయంలో అయినా సమ్మెకు సన్నద్ధమవుతామని ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడు పి.ఎన్.మూర్తి, కార్యదర్శి పి .శంకరరావు, వి.వి.మోహన్ జి.రామారావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని అన్ని డిపోలు, బస్‌స్టేషన్‌లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా శుక్రవారం నుంచి విద్యార్థులకు బస్‌పాస్‌ల జారీ చేయనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు తెలిపారు. మధురవాడ, మద్దిలపాలెం, వాల్తేరు, ద్వారకాబస్‌స్టేషన్, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం, ఎంవీపీ కాలనీలలో ప్రత్యేక కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయి. ఏపీఎస్ఆర్టీసీపాస్.ఇన్‌లో విద్యార్థుల వివరాలు, ఫొటో అప్‌లోడ్ చేసి దరఖాస్తు ఫారం ప్రింట్ తీసి, దానిపై ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపల్‌తో సంతకం చేయించాలి. ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ, పదోతరగతి పాస్ సర్టిఫికేట్‌ను జత చేసి డిపో కార్యాలయానికి అందజేయాలి. దరఖాస్తు పరిశీలించిన అనంతరం రాయితీతో విద్యార్థి బస్‌పాస్‌ను జారీ చేస్తారని ఆర్ఎం పేర్కొన్నారు. 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలకు ఉచితంగానే బస్సు పాస్‌లు జారీ చేస్తారని పేర్కొన్నారు. వార్షిక, త్రైమాసిక, నెలవారీ, రూట్ పాస్‌లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

అర్బన్ సీడీపీఓగా నీలిమ

మర్రిపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ అర్బన్ సీడీపీఓగా నియమితులైన కె.నీలిమ బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీడీపీఓ రమణకుమారి, కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని నీలిమ అన్నారు. 2014లో ఉద్యోగంలో చేరిన ఆమె రాయచోటి, తూర్పుగోదావరి, విజయనగరం జిల్లాల్లో ఏసీడీపీఓగా విధులు నిర్వహించారు. 2020లో నక్కపల్లి, 2023లో దుంబ్రిగుడలో సీడీపీఓగా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం విశాఖ అర్బన్ సీడీపీఓగా వచ్చారు.

ఇసుక కొండ ఆలయ ఘాట్ రోడ్డులో ప్రమాదం

▸▸ భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం ▸▸ క్షేమంగా బయటపడిన సుమారు ఏడాది వయసు చిన్నారి


ప్రమాద స్థలంలో రక్తగాయాలతో దంపతులు.. (కృష్ణకుమారి మృతిచెందడానికి ముందు పరిస్థితి)

మహారాణిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపంలో ఇసుకకొండ సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా, భర్త తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం సమీపంలోని బుచ్చయ్యపేట మండలంలోని ఆర్.శివపురం ప్రాంతానికి చెందిన దేవర చిలకనాయుడు, అతని భార్య కృష్ణకుమారి కలిసి సుమారు ఏడాది వయసు ఉన్న కుమార్తెతో కలిసి ఇసుకకొండ స్వామి దర్శనానికి వచ్చారు. చిలకనాయుడు దివ్యాంగుడు కావడంతో తన మూడు చక్రాల వాహనంపై వచ్చారు. ఉదయం 10.30 గంటల సమయానికి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డు దిగుతూ వాహనంపై వేగంగా వస్తున్నారు. వేగం తగ్గించమని అతని భార్య కృష్ణకుమారి హెచ్చరిస్తుండగానే, మలుపులో వాహనాన్ని అదుపు చేయలేక నేరుగా వెళ్లి గోడను బలంగా ఢీకొట్టాడు. దీంతో కృష్ణకుమారి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, చిలకనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలో ఉన్నవారు అతడిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. వారి చిన్నారి కుమార్తె మాత్రం క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. చిలకనాయుడు పరిస్థితి విషమంగా ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వరుల కల్యాణం


ఉమా చంద్రమౌళీశ్వరస్వామివార్లు

డాబాగార్డెన్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయ ప్రాంగణంలో ఈవో జీవీ రమాభాయి పర్యవేక్షణలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం బుధవారం శైవ ఆగమ సంప్రదాయంలో నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ముందుగా చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కల్యాణమూర్తులను పల్లకిలో ఉంచి తిరువీధి అనంతరం ఉమా చంద్రమౌళీశ్వరస్వాముల కల్యాణోత్సవాన్ని జరిపార పాల్గొన్న దంపతులను శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు. ఎం.వి.రాజశేఖర్, ఆలయ సిబ్బంది, సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పంచాక్షరి మంత్రంతో దేవాలయ ప్రాంగణం మారు మోగింది. తిరువీధిలో అన్నమయ్య సేవా ట్రస్ట్ బృందం కోలాట ప్రదర్శన చేసింది.

ఘనంగా సత్యనారాయణ స్వామికి పూజలు

మహారాణిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుకకొండపై రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసి ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారి దర్శనాలు చేసుకున్నారు. అనేక మంది భక్తులు వ్రతాలు చేయించారు.

వన్‌టౌన్‌లో 8 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

మహారాణిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు, బుధవారం రాత్రి పాతబస్టాండ్ సమీపంలో ఫ్రూట్ మార్కెట్ వద్ద పోలీసులు సుమారు 80 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. వాటిని శ్రీకాకుళం తరలిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రాక రేపు

(3వ పేజీ తరువాయి)

ఎరీనాకు వెళతారు. ఆరు గంటల వరకూ పలు పరిశ్రమలకు సంబంధించిన శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. అక్కడే పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, తరువాత వర్చువల్‌గా ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అక్కడ నుంచి ఆరు గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. ఆయా ప్రాంగణాలు, వేదికలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత కలిసి బుధవారం పరిశీలించారు. కొన్ని అత్యవసర పనులు వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేటి నుంచి పాఠశాలలు

(3వ పేజీ తరువాయి)

ప్రాథమిక పాఠశాలలు, 21 యూపీ, 76 ఉన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్, ఐదు ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు మొత్తం 563 ఉంటాయి.

కాగా గత ప్రభుత్వం అమలుచేసిన నాడు-నేడు పథకం (ప్రస్తుతం మన బడి-మన భవిష్యత్తు) కింద చేపట్టిన నిర్మాణాలు కొంతవరకూ అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు రూ.23 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి విడుదలైతే 460 గదులు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంచనావేస్తున్నారు. ఇదిలావుండగా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌తో జిల్లాలో చాలా పాఠశాలల టీచర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా టీచర్లు రానున్నారు. వీరి ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యార్థులు చేరికకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేయనున్నారు.

కూటమి పాలనపై సానుకూలత

(3వ పేజీ తరువాయి)

చాలా బాగుందని కృష్ణా కాలేజీ ప్రాంతానికి చెందిన ఎస్.దాక్షాయణి అనే గృహిణి పేర్కొన్నారు.

మిశ్రమ స్పందన అందుకే..

కొన్ని సంక్షేమ పథకాలను ఇంకా అమలు చేయకపోవడంపై అసంతృప్తి ఉ న్నా, కొన్ని నిర్ణయాలను మాత్రం కొన్నివర్గాలు సమర్థిస్తున్నాయి. సంక్షేమ పథకాలన్నీ అమలు చేయకపోయినా, ఉచిత గ్యాస్ సిలిండర్ ఇచ్చారని జగదాంబ సెంటర్ ప్రాంతానికి చెందిన ఎం.లక్ష్మి అభిప్రాయపడ్డారు. అమ్మ ఒడి, ఇతర పథకాలు కూడా అమలు చేస్తే బాగుంటుందని, ఏడాది పాలన పర్వాలేదన్నారు. కోట్లాది రూపాయలు అప్పులు చేసి రాజధానికే పెడుతున్నారని, మిగిలిన ప్రాంతాలపై దృష్టిసారించాలని ప్రైవేటు ఉద్యోగి తాలాడ శివకృష్ణ పేర్కొన్నారు. అయితే పాలనలో మాత్రం పారదర్శకత పెరిగిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా అప్పులు చేస్తోందని, అయితే అభివృద్ధిని మాత్రం పరుగులు పెట్టించేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని సీతమ్మధారకు చెందిన నరసింహ అన్నారు.

ఈ నిర్ణయాలపై వ్యతిరేకత..

సంక్షేమ పథకాలను ఇంకా పూర్తిగా అమలు చేయకపోవడంపై కొందరు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని, ఫైన్లు వేయడమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని ఆటో డ్రైవర్ లక్ష్మణరావు పేర్కొన్నాడు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదని రాజేంద్రప్రసాద్ వెల్లడించాడు. నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారో గుర్తించే ప్రక్రియను కూడా చేపట్టలేదని, మరి నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించాడు. ప్రజలకు స్కీమ్స్ అందిస్తే వ్యాపారాలు జరుగుతాయని, పాలన ఆశించిన స్థాయిలో లేదని కె.రాజు అనే వ్యాపారి అసంతృప్తి వ్యక్తంచేశారు.

ఏపీ ఈఏపీసీఈటీ ఫలితాల్లో శ్రీవిశ్వ విజయభేరి

సీతంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విడుదలైన ఏపీ ఈఏపీసీఈటీ 2025 ఫలితాలలో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. విశాఖపట్నం విద్యా సంస్థ శ్రీవిశ్వ విద్యార్థులు ఎంపీసీ, బైపీసీలలో సాధించిన ర్యాంకుల వివరాలివి. జి.గురుచరణ్ 147, సీహెచ్ఎం సాయి సాకేత్ 160, ఎస్.నాగ లలిత శ్రావ్య 191, బి.వర్షిణి 184, బి.శ్రావణి 259, జి.ఉషాశ్రీ 396, షేక్ నిజాముద్దీన్ 343, కె.వి.కుటుంబ నిహార్ 383, సీహెచ్ వెంకట హేమ వర్ధన్ 472, యు.జయంత్ కుమార్ 519, ఎం.రాజేష్ 528, డి.అజయ్ 553 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు ర్యాంకులు 28 మంది, ఐదు వేల లోపు 162 మంది, పది వేల లోపు 320 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ కె.ధర్మరాజు ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

సమాచార శాఖ డీడీగా సదాశివరావు

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సదాశివరావు విశాఖపట్నానికి బదిలీ చేశారు. విశాఖలో పనిచేస్తున్న డీడీ ఎస్వీ .రమణను అనకాపల్లికి బదిలీ చేశారు. విజయనగరంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న డి.రమేష్ విశాఖలోని స్టేట్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్‌కు వచ్చారు.

ప్రధాని మోదీ గ్లోబల్ లీడర్: డాక్టర్ కె.లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ నాయకులు

మురళీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రపంచ దేశాలంతా గ్లోబల్ లీడర్‌గా కీర్తిస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. మోదీ అభివృద్ధి పథమే పార్టీని మూడోసారి గెలిపించిందన్నారు. మురళీనగర్ బిర్లా జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ తన విశాలమైన ఆలోచనలకు అనుగుణంగా వక్ఫ్ బిల్లు, వన్ నేషన్.. వన్ ఎలెక్షన్ బిల్లులు ప్రవేశ పెట్టారని అన్నారు. కుల, మతాలతో చట్టాన్ని ముడిపెట్టకుండా అందరికీ సమన్యాయం అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచనగా తెలిపారు. భారత్ ఇపుడు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ప్రపంచ దేశాలతో పోటీపడి ముందుకు సాగుతుందని డా.లక్ష్మణ్ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్నామన్నారు. రూ.6,300 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శరవేగంగా అందుబాటులోకి తీసుకువస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో విశాఖ నగరానికి ప్రత్యేక స్థానం కల్పిస్తోందని పేర్కొన్నారు. విశాఖను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి రూ.2,500 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రధాని ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్.మాధవ్, అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

ఉక్కు దూకుడు

(3వ పేజీ తరువాయి)

వర్షాకాలం. కిరండోల్ లైనులో కొండ చరియలు విరిగి పడి రైళ్ల రాకపోకలు ఆగిపోతుంటాయి. అటువంటి పరిస్థితి ఎదురైనా బ్లాస్ట్‌ఫర్నేస్‌లు ఆగకుండా ఉండేందుకు తగిన నిల్వలు ఉంచుకోవాలి. రైల్వే ర్యాకులను అవసరమైనన్ని సమకూర్చాల్సి ఉంది.

ఐరన్‌ఓర్ అవసరమైనంత లేకుంటే దానికి బదులుగా పెల్లెట్లు వినియోగిస్తారు. ఇవి ఖరీదైనవి. టన్నుకు రూ.5 వేలు అదనపు వ్యయం అవుతుంది. కాకపోతే మరింత నాణ్యమైన స్టీల్ తయారవుతుంది. ముందుచూపుతో యాజమాన్యం 1.5 లక్షల టన్నుల పెల్లెట్లను ముందుగానే కొనుగోలు చేసింది. టన్నుకు రూ.10,500 వెచ్చించింది. ఈ ధర ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుంది.

అలాగే పూర్తి ఉత్పత్తికి రోజుకు 13 వేల టన్నుల కోక్ అవసరం. అవసరమైన కోకింగ్ కోల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కోక్ ఓవెన్ల ద్వారా రోజుకు 410 పుష్‌లు తీయాల్సి ఉంటుంది. కోక్ ఓవెన్ బ్యాటరీలు ఐదు ఉండగా, వాటిలో 1, 3 బ్యాటరీలకు నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. ఆ పనులు పూర్తి చేయడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. ఆ పనులు చేపట్టకుండానే పూర్తి ఉత్పత్తికి యత్నిస్తున్నారు. అది సాధ్యం కాదని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. 370-380 పుష్‌లకు మించి రావని అంటున్నారు. ఇవి పూర్తిస్థాయిలో పనిచేయకపోతే రోలింగ్ మిల్స్ నడపడానికి అవసరమైన గ్యాస్ ఉత్పత్తి కాదు. ఆ పరిస్థితి ఉత్పన్నమైతే వాటిని కొంత సమయం ఆపి, మళ్లీ ప్రారంభించాల్సి ఉంటుంది. దీనిని డౌన్ అండ్ అప్‌గా వ్యవహరిస్తారు. రోజూ ఇదే విధంగా వాటిని నడిపితే రిఫ్రాక్టరీ వ్యవస్థ దెబ్బతింటుంది. అసలుకే మోసం వస్తుంది.

తగ్గిపోయిన సిబ్బంది

స్థిర వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పి కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తొలగించేశారు. వారిలో నైపుణ్యం కలిగిన వారూ ఉండడం వల్ల ఇప్పుడు ప్లాంటును పూర్తిస్థాయిలో నడపడానికి ఇబ్బందులు వస్తాయి. కొన్ని కీలక విభాగాల నిర్వహణను కాంట్రాక్టుకు ఇచ్చినా వారు పూర్తిస్థాయిలో పనిచేస్తారనే విశ్వాసం లేదు. అధికారులను రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇలా ఎన్నాళ్లు తాము చేయగలమని ప్రశ్నిస్తున్నారు. సరైన యాజమాన్యం లేకపోవడం వల్లనే స్టీల్‌ప్లాంటు నష్టాల్లోకి వెళ్లిందని ప్రకటించిన కేంద్రం ఇప్పటికీ దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా పూర్తి ఉత్పత్తికి వెళ్లడం ఏ విధంగా సమంజసమని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. తమ వైపు పూర్తి సహకారం ఉంటుందని సంఘాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. జీతాలు ఇవ్వకున్నా పనిచేస్తున్నామని, హెచ్ఆర్ఏ కట్ చేసినా మిన్నకున్నామని, విద్యుత్ చార్జీలు పెంచినా కడుతున్నామని, సిబ్బందిని వేల సంఖ్యలో తీసేసినా ధర్నాలు చేయవద్దంటే చేతులు కట్టుకొని ఉన్నామని, ఇంతకంటే ఇంకేమి చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా యాజమాన్యానికి సహకారం కాదా? ఇప్పటికీ విశ్వసించరా? అంటూ వాపోతున్నారు. తోటి పనివారిని ఉద్యోగం లోనుంచి తీసేస్తే దానిని కూడా ప్రశ్నించకూడదంటే...ఇక ప్రజాస్వామ్యానికి అర్థం ఉందా? అని మథనపడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయశాఖ
ఇ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు (2nd Call)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా శ్రీ రామాలయము, తునివలస గ్రామము, పద్మనాభం మండలం, విశాఖపట్నం జిల్లా నందు దేవాలయమును పునర్ నిర్మించుటకు రూ.60.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.
ఇట్లు
కార్యనిర్వాహక అధికారి
ఫోన్స్: 9550515222, 9603736026

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి॥ నెం.బి.1818
DCCB VSP
ప్రధాన కార్యాలయము, మర్రిపాలెం, విశాఖపట్నం-09
ఫోన్ నెం.2788612 & 2788611.
62వ మహాజన సభ నోటీసు
ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి॥ విశాఖపట్నం యొక్క మహాజన సభ సమావేశము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘముల చట్టం సెక్షన్ 32 (1) ప్రకారము తే.18-06-2025ది బుధవారం ఉదయం 11.00 గం॥లకు ఉడా లే అవుట్, మర్రిపాలెం, విశాఖపట్నంలో గల బ్యాంకు కేంద్ర కార్యాలయము నందు జరుపబడును. కావున సభ్యులందరు సదరు మహాజన సభకు తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.
స్థలం : విశాఖపట్నం
తేది : 02-06-2025
టు,
అందరు సభ్యులకు
పర్సన్-ఇన్-ఛార్జ్ వారి అనుమతితో
సం/- డి.వి.ఎస్. వర్మ
ముఖ్యకార్యనిర్వహణాధికారి
గమనిక : 1. మహాజన సభకు సంఘ పర్సన్-ఇన్-ఛార్జ్‌లు మాత్రమే హాజరు కావలెను.
2. మధ్యాహ్నం గం.2.00లకు లంచ్ ఏర్పాటు చేయడమైనది.

శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం
సింహాచలం, విశాఖపట్నం జిల్లా , ఆంధ్రప్రదేశ్. ఫోన్: 99591 16669
సీల్డ్ టెండరు ప్రకటన
ఆర్.సి.నెం.జి4/2/2025, తే.11.06.2025
శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, దేవస్థానమునకు చెందిన శ్రీ స్వామి వారి కృష్ణాపురం గోశాల నందు ఉన్నట్టి వంటి గోవుల నుండి లభించిన పాలు గోమయము మరియు గోమూత్రమును వాడుకుచేసుకొనుటకు ఒక సంవత్సర కాలమునకు అనగా అప్పగింత తేది నుండి తీసుకొనిపోవుటకు సీల్డు టెండర్లు పిలువబడుచున్నవి. టెండరు షెడ్యూలు తీసుకొనుటకు తేది.23-06-2025 నుండి 28-06-2025 వరకు సాయంత్రం 5.00 గం.ల లోపు పొందవలెను, తదుపరి తేది 30-06-2025 న సింహాచలం దేవస్థానం కార్యాలయం నందు గల టెండర్లు బాక్సు నందు ఉ.11.00 గం.ల లోగా వేయవలెను. తదుపరి వచ్చిన టెండర్లు స్వీకరింపబడవు. సదరు టెండర్లు అదేరోజు మ॥ 3.00 గం.ల కు టెండరుదారుల సమక్షములో తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యలయం పనిచేయువేళల యందు సంప్రదించవలెను.
సం/- వి.త్రినధరావు
కార్యనిర్వాహణాధికారి

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్ 2),భవనం సంఖ్య 02,బీరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710
గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు
[illegible]
AUCTIONDATE 21.06.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO-14-1-2/B,GROUND FLOOR,NOWROJI ROAD,MAHARANI PETA, VISAKHAPATNAM - 530002,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CHWTRPJ2412110002	SUKUMAR BENNY CHEEDI	MRNPTPJ2412260002	ARAVIND TEDDU
CHWTRPJ2412140001	POTTI YERNI RAJU	PNRTHPJ2412050001	RONGALI CHANDRA SEKHAR
CHWTRPJ2412230008	PEDDOJU BETSHBARANI		
VZGCTPJ2412110002	SRINIVAS KATAPALLI	PNRTHPJ2412260001	SRINU AKKIREDDY
CHWTRPJ2412200005	VASU BANGARI	VIZA2PJ2409210003	RAMESH SUSARLA
MRNPTPJ2412070006	JAGADISH IDADASARI	VIZA2PJ2409300002	RAJU PONNADA
MRNPTPJ2412120002	KANAKADURGA GARIKINA	VIZA2PJ2409300003	RAJU PONNADA
MRNPTPJ2412260004	RAMU PATNANA	VIZA2PJ2409300003	RAJU PONNADA

వేలం సమయం: 11.00 AM [illegible]
తేది: 11.06.2025
స్థలం: విశాఖపట్నం
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

జగదాంబ
DOLBY ATMOS LASER 4K
Timings : 11.00, 2.30, 6.30, 10.00


CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PAPALA KUMARI (Old Name) W/o. Papala Trinadha, Resident of: FNO:302, Sri Lakshmi Residency, Kothavalasa, Vizianagaram. Change my Name from PAPALA KUMARI (Old Name) to PALLI KUMARI (New Name) hence forth I am being called as PALLI KUMARI (New Name) all purposes.
AJV_241668

LOSS OF PASSPORT

★ I, PILLA PAVAN S/o Pilla Pydi Raju R/o. D. No. 5 - 3 - 39E, Near Waltair Bus Depot, Peda Jalaripeta, Visakhapatnm - 530017. I have lost my Original Pass Port (No. V5436117) on 25-5-2025, while doing work painting works at home and i shipting the house articles. If any-body found please contact : 7731829292
AJV_231681

ఉద్యోగావకాశాలు

➡ Sunanda Group Conducting Recruitment drive QR Technicians : (1) ITI / Diploma : Electrical / Electronics / Mechanical, Engineers : (2) B.Tech / M.Tech : E.E.E / E.C.E / Mechanical, FRESHERS ALSO WELCOME Venue : Sunanda Renewable Energies Pvt.Ltd, Banjarahills, Hyderabad. Email : hr@sunandagroups.com, 8919081981, 7207705666.
AJG-2275

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

జనరంజక పాలన



కూటమి ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల మనోగతం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వివిధ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. పరిపాలన గాడిలో పడిందని, వివిధ వర్గాలకు మేలు చేకూరుతోందని సంతోషం వ్యక్తంచేశారు. వ్యవసాయానికి మరింత చేయూత, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి నిలపడం, మిగిలిపోయిన పేద వర్గాలకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయడం అవసరమని సూచించారు. పాలనపై ఎవరు ఏమన్నారంటే....

కూటమి పాలన భేష్



కూటమి ప్రభుత్వం ఏడాది పాలన చాలా బాగుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తోంది. గెలిచిన వెంటనే డీఎస్సీ నియామకాలపై మొదటి సంతకం చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు బ్యాంకు ఖాతాలో వేయడానికి నిర్ణయించడం హర్షణీయం. మరో నాలుగేళ్ళు కూడా సుపరిపాలన అందించాలని కోరుతున్నాం.

-సోరంపూడి జయ, శ్రీనివాసనగర్, అక్కయ్యపాలెం

నిరుద్యోగ భృతి ఇస్తే యువతకు ఆసరా



రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ఉపాధి కల్పనకు పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావటం మంచి విషయం. అయితే ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది. ఉపాధి లభించే వరకు యువతకు ఆర్థిక భరోసా అవసరం. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయటానికి చర్యలు తీసుకోవాలి.

- జి.రేణుక, గాజువాక

ఒకే ఏడాది అన్నీ అసాధ్యం



ప్రభుత్వ పనితీరు చాలా బాగుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంతి చంద్రబాబు చాలా కృషి చేస్తున్నారు. ఉదయం ఆరోగంటకు పింఛన్ వస్తుంది. మరికొన్ని రోజులలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లభించనుంది. అన్నీ ఒకే ఏడాది అమలు చేయాలంటే ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు. ఎలాంటి భేషజాలకు పోకుండా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం అందిస్తున్నారు.

- కోస్టు శ్రీనివాస్, అకౌంటెంట్ , మహరాణీపేట

సంక్షేమం, అభివృద్ధి సమతూకం



కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు వెళ్తోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే సంక్షేమం, అభివృద్ధి సమానంగా నడిపిస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి శూన్యం. ఏ ప్రభుత్వం వచ్చినా వ్యాపారులకు చేసింది మాత్రం ఏమీ లేదు.

-ఎన్ని మాధవరావు, వ్యాపారి, ఆనందపురం

వేధింపుల నుంచి విముక్తి



ప్రభుత్వం మారడంతో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. గత ప్రభుత్వంలా ప్రజలకు వేధింపులు, భయానక వాతావరణం లేకపోవడంతో ప్రశాంతంగా ఉండగల్గుతున్నారు. అనవసర ఖర్చులు తగ్గించి నిదానంగా పరిపాలన జరుగుతుంది. ఇచ్చిన హామీలును కూటమి నాయకులు నెరవేర్చుతారనే నమ్మకం ప్రజలకు ఉంది. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి పొందుతుందన్న నమ్మకం ఉంది.

- చొల్లంగి వెంకటేశ్వర్రావు, వ్యాపారి, కంచరపాలెం

ఉద్యోగుల ఇబ్బందులపై దృష్టి సారించాలి



ప్రస్తుత ప్రభుత్వ పనితీరు బాగుంది. ఏ ప్రభుత్వంలో అయినా ఉద్యోగి సంతృప్తి చాలా అవసరం. ఆ విషయంలో ఈ ప్రభుత్వం కొంత విజయం సాధించినా, మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. వాటిని ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నాం.

-కోలా బంగారయ్య, ఏయూ ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

బాగానే చేస్తున్నారు



ప్రభుత్వ పాలన పర్వాలేదు. పెంచిన పింఛన్లు, గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం ఇస్తున్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారు. అన్ని హామీలు ఒకేసారి చేయాలంటే డబ్బు ఉండాలి కదా.. జగన్ పెట్టిన అప్పులు తీరుస్తూ సంక్షేమ పథకాలు ఇస్తున్నారు.

-కాసరపు పెంటయ్య, మత్స్యకారుడు, భీమిలి

ప్రభుత్వ నిర్ణయాలు మేలు చేస్తున్నాయి



ప్రజలను పాలించాలంటే అనుభవం ఉండాలి. అనుభవం లేని నాయకుల చేతుల్లోకి పాలన వెళ్తే గందరగోళంగా ఉంటుంది. ఏడాదిగా ఎలాంటి గందరగోళం లేదు. కొత్త ప్రభుత్వం రాగానే రూ.4 వేలకు పింఛన్ పెంచి మమ్మల్ని ఆదుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో ఉంటాం. రేషన్ తీసుకోవాలంటే ఒక రోజు పనికి వెళ్లడం మానేయాల్సి వచ్చేది. ఈ నెల ఆ పరిస్థితి లేదు. సాయంత్రం పని నుంచి వచ్చి రేషన్ డిపోలో సరుకులు తీసుకున్నాం. ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మాకు ఉపయోగకరంగా ఉన్నాయి.

-కె.సీతయ్య , భవన నిర్మాణ కార్మికుడు, మద్దిలపాలెం

మధ్యతరగతి గురించి ఆలోచించాలి



కిందిస్థాయి వారికీ, ఉన్నత వర్గాలకు బాగానే ఉంది. ప్రతిసారీ ఇబ్బందులు పడుతున్నది మధ్య తరగతే. ఏ పథకాలూ ఉండవు. ఓ పక్క పన్నుల భారం, మరో పక్క నిత్యావసరాలు, ఇతరత్రా భారీగా ధరలు పెరిగిపోతున్నాయి. వీరికి మేలు చేకూరే విధంగా మరో స్లాబుకు రూపకల్పన చేసి, అమలు చేస్తే ఆనందంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

- ఎం.వి.అప్పలరాజు, ప్రైవేటు ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

సాగుకు సాయం అందజేయాలి



రాష్ట్రంలో ప్రభుత్వ పాలన బాగానే ఉంది. అయితే రైతు సాగుకు సాయం అందేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలి. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయం వర్షాధారం కావడంతో పంట కాలువల్లో పూడిక తీయించి సాగు నీరు అందించేలా చేయాలి, ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించాలి. ట్రాక్టర్లు సబ్సిడీపై అందజేయాలి.

- వెన్నెల పెంటబాబు, రైతు, పెందుర్తి

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పటి వరకు కూటమి ఏలుబడి బాగానే ఉంది. నాకు పింఛను పెద్ద ఆధారం. ఈ ప్రభుత్వం పింఛను పెంచడంతో ఎంతో ఉపయోగంగా ఉంది. కొత్తగా పింఛన్లు ఇవ్వకపోవడంతో నాలాంటి ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవారికి మంజూరు చేస్తే ప్రభుత్వంపై విమర్శలు రావు.

- ఆడారి రామకృష్ణ, రోజువారి కార్మికుడు, జ్ఞానపురం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం



ఈ ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోంది. దానికి అనుగుణంగా ఆర్థిక అభివృద్ధిని సాధిస్తూ సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రజల ఆకాంక్షల మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు కూడా ప్రభుత్వాన్ని జోడు గుర్రాల్లా పరిగెత్తిస్తూ ప్రభుత్వం ప్రజల మన్నన పొందుతోంది.

-ఉప్పాడ విజయలక్ష్మి, గృహిణి, సింహాచలం

జేష్ఠపౌర్ణమి సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం/మల్కాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జేష్ఠ పౌర్ణమి సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో బుధవారం సాయింత్రం నిర్వహించిన శ్రీవారి పల్లకీ సేవ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మేళతాలాలతో, కోలాటాల మధ్య శ్రీవారి పల్లకి సేవ అంగరంగవైభవంగా జరిగింది. అలాగే మల్కాపురం వెంకట్రాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామికి జేష్ఠపౌర్ణమి సందర్భంగా సమస్రనారీ కేళాభిషేకం కనులపండుగగా జరిగింది. స్వామివారి విగ్రహానికి 1008 కొబ్బరి బోండాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా 27నక్షత్రాలను 27కలశాలలో ఆవాహన చేసి ప్రత్యేక పూజలు చేశారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 16, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 16, క్యారెట్ 44 దొండకాయలు 20, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 32, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

13 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

విశాఖపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విశాఖపట్నం జోన్-2, బొబ్బిలి, జగ్గంపేట డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం సర్కిల్ జోన్-2 డివిజన్ పెదగంట్యాడ సెక్షన్‌లో ఈనెల 13న, విజయనగరం సర్కిల్ బొబ్బిలి డివిజన్ మెంటాడ సెక్షన్‌లో ఈనెల 17న, కాకినాడ సర్కిల్ జగ్గంపేట డివిజన్ హంసవరం సెక్షన్‌లో ఈనెల 19న సీజీఆర్ఎఫ్ సదస్సులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. సంబంధిత కార్యాలయాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30వరకు జరుగుతాయని ఈ సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్తు సరఫరా పునరుద్ధరణలో జాప్యం, తదితర విద్యుత్తు సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సమస్యలను 1912 టోల్ ఫ్రీ నెంబరుకు సంప్రదించవచ్చునని సూచించారు. ఈ సదస్సులో చైర్‌పర్సన్ బి సత్యనారాయణ తో పాటు కమిటీ సభ్యులు బి సులేఖరాణి, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీ కృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ఆటోనగర్/ మల్కాపురం జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు కల్యాణ మండపంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు, గాజువాక మండల అధ్యక్షురాలు పావని ఆధ్వర్యంలో బుధవారం యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. జీవీఎంసీ 58, 59 వార్డుల్లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం యోగా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఆసనాలు వేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూత్రం చెప్పి ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. 21 విశాఖ సాగరతీరాన్నా నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం/ఆర్పిపేట, జూన్11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండమీద పలు అభివృద్ధి పనులకు వార్డుకార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేశ్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు ఎంతో ప్రొత్సహిస్తున్నారని, వారి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. అలాగే జీవీఎంసీ 56వ వార్డులో గవరకంచవపాలెం రైల్వే ట్రాక్ రోడ్డులో ఆధునిక విద్యుత్ దీపాలుఏర్పాటు పనులకు వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకముందు రైల్వే ట్రాక్ రోడ్డు అంధకారంగా ఉండేదని, ఇప్పుడు విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు ప్రారంభించడంతో స్థానికులు ఉపశమనం పొందారని పేర్కొన్నారు.

ఎలక్ట్రిషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

పెందుర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సహకారంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు పవర్ సెక్టార్ కింద జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 21 నుంచి 55 సంవత్సరముల వయసు ఉన్న వారు ఈ కోర్సుకోసం సంవత్సరం పాటు ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా స్టేషనరీ అందజేస్తామని తెలిపారు. మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పిస్తామని, శిక్షణ పూర్తయిన తరువాత కేంద్ర ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 93948 85164 నంబర్‌కు సంప్రదించాలని ఏడీ రవికుమార్ తెలిపారు.

పల్లా సింహాచలానికి ఘన నివాళి



పల్లా సింహాచలం పటానికి నివాళులు అర్పిస్తున్న పెదగంట్యాడ ఇంటక్, టీడీపీ నాయకులు

పెదగంట్యాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కార్మిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి పెదగంట్యాడ ఇంటక్ నాయకులు, సీతానగరం టీడీపీ నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. గాజువాకలోని పల్లా సింహాచలం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, స్టీల్ ప్లాంట్ ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వంశీకృష్ణ, టీడీపీ 75వ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసిత సంఘం ఆధ్వర్యంలో..

మాజీ శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పల్లా సింహాచలానికి పెదగంట్యాడ నిర్వాసిత నాయకులు ఘన నివాళులు అర్పించారు. పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లోని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నిర్వాసిత సంఘం నాయకులు పాల్గొని సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేటి నుంచి ప్రైమరీ స్కూళ్లల్లోనే 3, 4, 5 తరగతులు

గాజువాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో విలీనమైన 3, 4, 5 తరగతులు తిరిగి మోడల్ ప్రైమరీ స్కూలులో వీలనమయ్యాయి. గాజువాక నియోజకవర్గానికి సంబంధించి ఏడు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు సమీపంలో ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్‌లో తిరిగి చేరనున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులు విలీనం అయిన మోడల్ ప్రైమరీ స్కూలులో చదువులు కొనసాగుతాయి. గాజువాక మండలానికి సంబంధించి అక్కిరెడ్డిపాలెం, కణితి, యారాడ, కొండయ్యవలస, పెదగంట్యాడ మండలాలకు సంబంధించి గంగవరం, నడుపూరు, ఇస్లాంపేట హైస్కూల్‌లో గతంలో ఉన్న 3, 4, 5 తరగతులు ఈ ఏడాది నుంచి గతంలో మాదిరిగానే మోడల్ ప్రైమరీ స్కూలులో కొనసాగనున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూలులో తరగతులతో పాటు విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఓ ప్రధానోపాధ్యాయుడితో పాటు నలుగురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను కేటాయించారు. ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ బదిలీలతో ఈ పోస్టులు భర్తీ కానున్నాయి.

పెందుర్తి తహశీల్దార్ వెనక్కి

» మరో తహశీల్దార్ రాకపై సందేహాలు

విశాఖపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖకు కేటాయించిన ఇద్దరు తహసీల్దార్లు టి. రామకృష్ణ, ఎంవీవీ. ప్రసాద్ రాకపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు జీకేవీధి తహశీల్దారుగా పనిచేస్తున్న టి. రామకృష్ణను పెందుర్తి తహసీల్దారుగా బదిలీ చేశారు. అయితే ఆయనపై పలు ఆరోపణలు వచ్చిన విషయంపై ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం రామకృష్ణను తిరిగి అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపాలని నిర్ణయించారు. ఇప్పటికే పెందుర్తిలో పలుచోట్ల భూ వివాదాలు తలనొప్పిగా మారిన నేపథ్యంలో యంత్రాంగం, ముందుగా జాగ్రత్తపడి రామకృష్ణను వెనక్కి పంపాలని నిర్ణయించి ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. కాగా అల్లూరి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎంవీవీ. ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో మేజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమించారు .అయితే తహశీల్దారుగా పోస్టింగ్ ఇస్తేనే వస్తానని ఇక్కడ అధికారులకు చెప్పడంతో ఆయన రాకపై అనుమానం వ్యక్తమవుతోంది.

డీసీసీబీ చైర్మన్‌కు పలువురి అభినందనలు

ఎన్.ఎ.డి.జంక్షన్/అక్కిరెడ్డిపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డులో మర్రిపాలెం ఉడాలేఅవుట్‌లో డీసీసీబీ కార్యాలయంలో బుధవారం గుంటూరు అర్బన్ బ్యాంక్ చైర్మెన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస యాదవ్ చైర్మెన్ కోన తాతారావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యాంకుల అభివృద్ధి నిర్వహణ తదితర అంశాలపై ఇరువురు మంతనాలు జరిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడు, జనసేన నాయకులు, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన పలువురు నాయకులు కోన తాతారావును కలిసి ఘనంగా సత్కరించారు.

మేయర్ పీలాతో 'జై బాలయ్య టీం'



మేయర్‌కు చిత్రపటాన్ని బహుకరిస్తున్న దృశ్యం

పెందుర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 'జై బాలయ్య టీం' బాలకృష్ణ అభిమాన సంఘం బుధవారం విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి నాలుగు దశాబ్దాలుగా వారు చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా తాము చేసే సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామని, నగరంలో ఎక్కడైన సంఘభవానికి స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని 'జై బాలయ్య టీం' మేయర్‌ను కోరింది. సంఘం వినతి పట్ల మేయర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం మేయర్, బాలకృష్ణ కలసి ఉన్న చిత్రపటాన్ని అందించారు.

అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ విజేత ఒడిశా



విజేత ఒడిశా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ఉక్కు స్టేడియంలో జరిగిన అంతరాష్ట్ర అంధ మహిళల క్రికెట్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఉదయం ఉక్కు స్టేడియంలో ఒడిశా- ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య ఫైనల్స్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 109 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. అనంతరం నిర్వహించిన ట్రోఫీ ప్రదానోత్సవ కార్యాక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమార్‌శర్మ విజేతగా నిలిచిన ఒడిశా జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ మహిళలు క్రికెట్ ఆడటం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులను ప్రొత్సాహించేందుకు ఎన్టీపీసీ విశేష చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిదులు పాల్గొన్నారు.

గ్రీన్‌సిటీలో బాలయ్య జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు

కూర్మన్నపాలెం,జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 65 జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. బాలయ్యబాబు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. ఫార్మా ఉద్యోగుల ప్రతినిథులు పొన్నగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ బాలయ్య పుట్టిన రోజుతో పాటు, వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు పుట్టిన రోజు కూడా ఈ రోజే కావడం విశేషమన్నారు. అందుకే ఆయనతోనే కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, వెంకట రమణ, శ్రీను, వెంకట్రావు, రామారావు, సునీల్, గణేష్, నానాజీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో పనిచేస్తూ మహిళ మృతి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మింది రహదారిలో ఉన్న ఐరన్ స్క్రాప్ దుకాణంలోని ఎం. జోగిరత్నం(50) అనే మహిళ పని చేస్తూ బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మరణించింది. దీంతో ఈ విషయం తెలెసుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు దుకాణానికి చేరుకున్నారు. కుటుంబసభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరకున్నారు. పోలీసులు దర్యాప్తుచేయగా జోగిరత్నం ఆరోగ్యం సరిగా లేక మృతిచెందిందని కుటుంబసభ్యులతో పాటు తోటి కార్మికులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి దుకాణయాజమాన్యం అంగీకరించింది.

బైక్‌ను ఢీకొన్న సీఐఎస్ఎఫ్ వాహనం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఈడీ భవనం వద్ద బుధవారం ఉదయం సీఐఎస్ఎఫ్ వాహనం ఒక ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడి ప్రాంతానికి చెందిన సీరాపు సత్తిబాబు(56), నెమలికంటి రామారావు(57) స్టీల్ ప్లాంట్ డబ్ల్యూఆర్ఎం విభాగంలో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం షిఫ్ట్ విధులకు వెళుతుండగా ఈడీ కార్యాలయం నుంచి ప్రధాన గేటు వైపునకు వస్తున్న సీఐఎస్ఎఫ్ వాహనం వీరి బైక్‌ను ఢీకొనడంతో వీరిద్దరికి గాయాలయ్యాయి. హుటాహుటిన ఉక్కు ఆస్పత్రికి ఇద్దరిని తరలించారు. సత్తిబాబు పరిస్థితి కొద్దిగా విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రామారావు ఉక్కు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.